క్లుప్తంగా

ఉపాధి హామీ పథకంతో వాడ్రాపల్లి అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు

మునగపాక: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వాడ్రాపల్లి గ్రామాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. వాడ్రాపల్లి సచివాలయ ప్రాంగణంలో బుధవారం 2025–26 సంవత్సరానికి సంబంధించి పని దినాల ఆమోదం కోసం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అమలుతో వలసల నివారణతో పాటు అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి, ఉపాధి హామీ పథకం ప్రతినిధి రామలక్ష్మి, పలువురు కూలీలు పాల్గొన్నారు.

చదువులో ఏకాగ్రత అవసరం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ జోగారావు

మునగపాక: పోటీ పరీక్షల్లో రాణించాలంటే చదువులో ఏకాగ్రత ఎంతో అవసరమని డాక్టర్ మళ్ల జోగారావు అన్నారు . మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్ఎంఎంఎస్ శిక్షణ ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. ఇందులో భాగంగా నిర్వహించిన పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. అనంతరం జోగారావు మాట్లాడుతూ విద్యార్థులు ఓ లక్ష్యంతో చదువుకోవాలన్నారు. ఇష్టపడి, కష్టపడి చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షుడు కేవీ రమణ, కోర్సు డైరెక్టర్ ఎం.సత్యనారాయణమూర్తి, శిక్షకులు కొణతాల సోమశేఖర్, పిల్లా జగదీష్, మాడెం జోగారావు, ఎంవై రాము, డి.నూకేష్, తదితరులు పాల్గొన్నారు.

కాలువల నిర్మాణానికి చర్యలు



డ్రైనేజీలను పరిశీలిస్తున్న ఈవోఆర్‌డీ చంద్రశేఖర్

పాయకరావుపేట: పట్టణంలోని ప్రశాంతినగర్, బృందావనం ఏరియాల్లో డ్రైనేజీలను ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్ బుధవారం పరిశీలించారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఫిర్యాదు మేరకు పరిశీలించిన ఆయన కాలువల నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు.

ఘనంగా కుంకుమ పూజలు, ఘటాల ఊరేగింపు



వాడ్రాపల్లిలో ఘటాల ఊరేగింపు

మునగపాక: దేవి శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా వాడ్రాపల్లిలో డప్పు వాయిద్యాల నడుమ ఘటాల ఊరేగింపు ఘనంగా జరిగింది. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, పెద్దలు మళ్ల వరహా నరసింగరావు, రామజోగినాయుడు, మళ్ల శేషు, దాడి చిన్నారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మునగపాక ఇందిరమ్మ కాలనీలో కుంకుమ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



మునగపాక ఇందిరమ్మ కాలనీలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

దినదిన గండం..!

- శిథిల స్థితికి రాంబిల్లి ఎంపీడీవో కార్యాలయ భవనం
- పెచ్చులూడిన పిల్లర్లు, శ్లాబ్.. కూలిన సీలింగ్
- వర్షాలకు రికార్డుల గదిలో చేరుతున్న నీరు



పాడైన ఎంపీడీవో కార్యాలయం వెనుక భాగం



పెచ్చులూడిన సన్‌షేడ్



ఎంపీడీవో కార్యాలయం లోపల కూలిన సీలింగ్

రాంబిల్లి (యలమంచిలి): ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా నిలిచే ఎంపీడీవో కార్యాలయం ప్రధాన భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఏ క్షణాన శ్లాబ్ పెచ్చులూడి మీద పడుతుందోనని బిక్కుబిక్కుమంటూ అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. అయినా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ భవనం నిర్మించి 15 ఏళ్లు కావస్తోంది. అప్పట్లో భవనం నిర్మాణంలో నాసిరకం మెటీరియల్స్ వాడటం వల్ల తక్కువ కాలంలోనే శిథిలావస్థకు చేరుకుంది. బయటకు బాగానే కనిపిస్తున్నా లోపల పిల్లర్లు పెచ్చులూడిపోతోంది. శ్లాబ్ పాడైపోయింది. సీలింగ్ కూలిపోయింది. దీంతో ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. రికార్డులు భద్రపరిచే గదులు పూర్తిగా దెబ్బతిన్నాయి. వర్షం పడితే నీరు చిమ్మి కార్యాలయం లోపల ఉన్న రికార్డులు, కంప్యూటర్ సామగ్రి, ఫర్నిచర్ తడిసిపోతున్నాయి. కార్యాలయం వెనక భాగం పూర్తిగా పాడైపోయింది. భవనం బయట సన్‌షేడ్‌లు శిథిలమై ప్రమాదకరంగా మారాయి. ఎంపీపీ, ఎంపీడీవో, వివిధ శాఖల అధికారులు ఉండే గదులు పాక్షికంగా దెబ్బతిన్నాయి. విధులు నిర్వహించడానికి అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్నేళ్లుగా ఎంపీడీవో కార్యాలయానికి ఎటువంటి మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవు. మండల పరిషత్ కార్యాలయానికే మరమ్మతులు చేపట్టడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు అలసత్వం వహిస్తే.. ఇక గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భవనాలు పరిస్థితి ఏమిటని ప్రజలు ఆరోపిస్తున్నారు. అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఈ కార్యాలయం భవనం 15 ఏళ్లకే శిథిలావస్థకు చేరడంపై మండల ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఎంపీడీవో కార్యాలయం భవనానికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



ఎంపీపీ గదిలో ఊడిపోయిన సీలింగ్

బిక్కుబిక్కుమంటూ విధుల నిర్వహణ



కార్యాలయంలో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నాం. వర్షాలు కురిసినప్పుడు శ్లాబ్ నుంచి నీరు కారిపోతోంది. కార్యాలయంలో విలువైన రికార్డులు, పత్రాలు, కంప్యూటర్లు, ఫర్నిచర్ తదితర సామగ్రి పాడైపోతున్నాయి. పెచ్చులు ఊడిపడి తల మీద పడుతున్నాయి.భవనం మొత్తం చాలా వరకు శిథిలావస్థకు చేరుకుంది. లైట్లు, ఫ్యాన్‌లు కూడా సక్రమంగా పని చేయడం లేదు. ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని భయమేస్తోంది. తక్షణం ఎంపీడీవో కార్యాలయం భవనానికి మరమ్మతులు చేపట్టాలి.

– సన్యాసిరాజు, ఈవోపీఆర్డీ, రాంబిల్లి

ఎట్టకేలకు చెత్త తొలగింపు



తిమ్మరాజుపేట శ్మశానవాటిక వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న జేసీబీ



చెత్త తొలగించడంతో పరిశుభ్రంగా కనిపిస్తున్న తిమ్మరాజుపేట శ్మశానవాటిక

సాక్షి ఎఫెక్ట్..

మునగపాక: తిమ్మరాజుపేట శ్మశానవాటిక ఎదుట పేరుకుపోయిన చెత్తను ఎట్టకేలకు తొలగించారు. పారిశుధ్యం పడకేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో సాక్షి దిన పత్రికలో బుధవారం 'డంపింగ్ యార్డు కాదు.. శ్మశానవాటికే'శీర్షికతో ప్రచురితమైన కథనానికి సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మితో పాటు అధికారులు స్పందించారు. శ్మశానవాటిక ఎదుట పేరుకుపోయిన చెత్తను జేసీబీతో తొలగించారు. దుర్వాసన నుంచి విముక్తి లభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

కొత్త పంచాయతీల్లో పక్కా భవనాలకు ప్రతిపాదనలు

మునగపాక: మండలంలో నూతనంగా ఏర్పాటైన పంచాయతీలకు సంబంధించి భవనాల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపినట్లు మండల ఇంజినీరింగ్ అధికారి గులామ్ తెలిపారు. గత ప్రభుత్వంలో మండలంలోని 5 గ్రామాలను అదనపు పంచాయతీలుగా ఎంపిక చేశారు. జనాభా ప్రాతిపదికన మూలపేట, మల్లవరం, గొల్లలపాలెం, కాకరాపల్లి, రామగిరి గ్రామాలను కొత్త పంచాయతీలుగా ఎంపిక చేశారు. గతంలో 21 పంచాయతీలు ఉండగా.. కొత్తగా 5 పంచాయతీలను ఎంపిక చేయడంతో ఆ సంఖ్య 26కు పెరిగిన విషయం తెలిసిందే. అయితే కొత్తగా ఏర్పాటైన పంచాయతీలకు పక్కా భవనాలు లేకపోవడంతో సామాజిక భవనాల్లో సర్పంచ్‌లు, పాలకవర్గ సభ్యులు సమావేశాలు నిర్వహిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. కొత్త పంచాయతీలకు రూ.25 లక్షల వంతున భవనాలు నిర్మించేందుకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఆయా చోట్ల స్థలాలను అధికారులు పరిశీలిస్తున్నారు. త్వరలో భవన నిర్మాణాలు కార్యరూపం దాల్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలి



మాట్లాడుతున్న సమరసత సేవా ఫౌండేషన్ ఉత్తరాంధ్ర ధర్మ ప్రచారకుడు గంగాధర్

మునగపాక: దేవాలయాల కేంద్రంగా ప్రతి వారం భజనలు, పౌర్ణమికి సామూహిక హారతి వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలని సమరసత సేవా ఫౌండేషన్ ఉత్తరాంధ్ర ధర్మ ప్రచారకుడు ఆడారి గంగాధర్ కోరారు. బుధవారం మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ కన్వీనర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ కమిటీలు బాధ్యతగా పని చేస్తూ హిందూ ధర్మాన్ని పరిరక్షించేందుకు ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ మాలకొండయ్య, జిల్లా పరియోజనా ప్రముఖ్ శిరియాల సత్యనారాయణ, యలమంచిలి సబ్ డివిజన్ కన్వీనర్ బీవీ రమణ, మండల కన్వీనర్లు ఆడారి లక్ష్మణరావు, చోడపల్లి సత్యం, కొణతాల వెంకటరావు, కారె రాముడు, చింతకాయల గగన్‌కుమార్, ఆడారి త్రినాథ్, కొల్లి అప్పారావు, గిన్నే మహేశ్వరరావు పాల్గొన్నారు.

మునగపాక తహసీల్దార్ కార్యాలయం సందర్శన

మునగపాక: మునగపాక రెవెన్యూ కార్యాలయాన్ని బుధవారం సాయంత్రం అనకాపల్లి ఆర్‌డీవో ఆయిషా సందర్శించారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. పెండింగ్ రికార్డులు వేగవంతమయ్యేలా చూడాలని అధికారులను ఆమె ఆదేశించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. రీ–సర్వేకు సంబంధించిన వివరాలను తహసీల్దార్ అది మహేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. కార్యాలయానికి వచ్చే అర్జీదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు.

ఎరువుల యాజమాన్యంపై దృష్టి పెట్టాలి



మునగపాకలో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి



కొత్తలిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

మునగపాక: రైతులు ఎరువుల యాజమాన్యంపై దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్ జ్యోత్స్నకుమారి సూచించారు. మునగపాకలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆమె మాట్లాడుతూ వరిలో తెగుళ్లు సోకుతున్నట్లు గుర్తించామని, ఇందుకు తగు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు అందజేసే సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. పొలం పిలుస్తోంది ద్వారా రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ సింధూజ, రైతులు మల్ల సంజీవరావు, దాడి ముసిలినాయుడు, దాడి శివ, వేగి కృష్ణ, ఆడారి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్: ఖరీఫ్ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు పొందవచ్చునని యలమంచిలి వ్యవసాయ సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ బి.ప్రభాకర్ రైతులకు సూచించారు. బుధవారం యలమంచిలి మండలం కొత్తలి, మెట్టపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు వరి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించడానికి వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలన్నారు. రైతులతో కలిసి వరి పొలాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో పాలిమేర మోహన్‌రావు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణంపై ఫిర్యాదు



సెల్ టవర్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఈవోఆర్‌డీ చంద్రశేఖర్

పాయకరావుపేట: మండలంలోని అరట్లకోట గ్రామంలో నిర్మిస్తున్న సెల్ టవర్‌పై అందిన ఫిర్యాదుల మేరకు ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్ బుధవారం పరిశీలించారు. దీనిపై నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని ఆయన తెలిపారు. సెల్ టవర్ నిర్మాణంలో కచ్చితంగా నిబంధనలు పాటించాలని సూచించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



రమణయ్యపేటలో అధికారులతో సమావేశమైన కేంద్ర ప్రభుత్వ బృందం సభ్యులు

నక్కపల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర గ్రామీణ పంచాయతీరాజ్ శాఖల ప్రత్యేక బృందం సభ్యులు సూచించారు. బుధవారం బృందం ప్రతినిధులు అనిల్ గైక్వాడ్, అనిల్ నిమ్ బోత్కర్‌లు రమణయ్యపేటలో పర్యటించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు, అంగన్‌వాడీ కేంద్రం ద్వారా కల్పిస్తున్న సౌకర్యాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల కోసం కేంద్రం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. స్వయం సంఘాల పనితీరు తెలుసుకుని బ్యాంకు లింకేజీ ద్వారా చేపడుతున్న స్వయం ఉపాధి పనులను ఎలా జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకంలో ఎంత మందికి పని కల్పిస్తున్నారు.. ఎంత వేతనం గిట్టుబాటు అవుతోంది.. ఎన్ని రోజులు పని కల్పిస్తున్నారనే వివరాలపై ఆరా తీశారు. పథకాలను ప్రజలకు చేరువ చేసే బాధ్యత అధికారులదేనన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామరాజు, సర్పంచ్ కర్రి శ్రీనివాస్, ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ, ఎంఈవోలు కుంచం నరేష్, వి.నూకరాజు, సీడీపీవో శ్రీవిద్య, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

18 వైన్ షాపులకు 170 దరఖాస్తులు



ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ జి.శ్రీనివాసులు

పాయకరావుపేట: పాయకరావుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ప్రభుత్వం కేటాయించిన 18 వైన్ షాపులకు ఇప్పటి వరకూ 170 దరఖాస్తులు వచ్చాయని పాయకరావుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ జి.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైన్ షాపుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం మరో రెండు రోజులు గడువు పెంచిందని చెప్పారు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం 7 గంటల వరకూ తమ కార్యాలయంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు అందజేయవచ్చునన్నారు. ఈ నెల 14న అనకాపల్లి పాత బస్టాండ్ పక్కన ఉన్న

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



చిన్నదొడ్డిగొల్లులో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ

నక్కపల్లి: శరన్నవరాత్రుల్లో భాగంగా బుధవారం చిన్నదొడ్డిగొల్లు సంతబయలు వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి సన్నిధిలో సరస్వతీ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, రజితదేవి దంపతులు విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. గ్రామ అర్చకుడు శ్రీనివాస్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చదువుల తల్లీ వందనం

- అక్షరాభ్యాసాలతో ఆలయాలు కిటకిట
- సరస్వతీదేవి అలంకరణలో దుర్గమ్మ
- ఏడో రోజు వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

శరన్నవరాత్రుల్లో భాగంగా బుధవారం అమ్మవారు వాగ్దేవతామూర్తి సరస్వతీదేవిగా శ్వేత వస్త్ర ధారిణియై భక్తులకు దర్శనమిచ్చారు. ఆశ్వీయుజ శుద్ధ సప్తమి మూలా నక్షత్రం జగన్మాత జన్మనక్షత్రం. దీంతో ఊరూవాడా అమ్మవారి ఆలయాలు, విగ్రహాలను కొలువుదీర్చిన మండపాలు భక్తులతో కిక్కిరిశాయి. విద్యార్థులు సరస్వతీదేవి రూపంలోని అమ్మవారిని దర్శించుకుని, విద్యాబుద్ధులకై ప్రత్యేక పూజలు చేశారు. పలు చోట్ల అమ్మవారి ఆలయాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు.



హరిపాలెంలో సరస్వతీదేవీ అలంకరణలో దుర్గమ్మ



జలాల్ వీధిలో పూజలు అందుకుంటున్న జగన్మాత



మంగవరంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

యలమంచిలి రూరల్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పలు చోట్ల సరస్వతీ దేవిగా దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. యలమంచిలి పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లో చదువులమ్మ సరస్వతీదేవికి పిల్లలు, విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు. యలమంచిలి మిలట్రీకాలనీలో అమ్మవారు కొలువుదీరిన మండపం వద్ద పలువురు పిల్లలకు పురోహితులతో అక్షరాభ్యాసం చేయించారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో జరిగిన సరస్వతీ పూజల్లో పెద్ద సంఖ్యలో పిల్లలు పాల్గొన్నారు.

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం హరిపాలెం హిమగిరి కొండపై కొలువుదీరిన విజయదుర్గ అమ్మవారు సరస్వతీదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే అమ్మవారికి కాండ్రేగుల రామప్పారావు, అప్పలమణి దంపతులు రెండు తులాల బంగారు శతమానాలు, భీమిశెట్టి తాడురాజు–అన్నపూర్ణ దంపతులు 16 తులాల వెండి కాసుల పేరు బహూకరించారు. వాక్పతి విద్యా సంస్థల యాజమాన్యం విద్యార్థులకు పుస్తకం, పలక, పెన్నులు అందజేశారు. అమ్మవారి అలంకరణను శివ మాణిక్యాలరావు దంపతులు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్‌పర్సన్ మారిశెట్టి లక్ష్మీకాంతం సూర్యనారాయణ, శరగడం అప్పలనాయుడు, కాండ్రేగుల రాము, దాడి మత్స్యరాజు, ఆళ్ల నూకరాజు, శరగడం శ్రీను, మత్తుర్తి శ్రీను, ఆలయ పురోహితులు వెంకటేష్ పాల్గొన్నారు.

కోటవురట్ల: పాములవాకలో సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చిన దుర్గమ్మకు మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చినలింగాపురంలోని శ్రీదుర్గామల్లేశ్వర అయ్యప్పస్వామి ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేశారు.

పాయకరావుపేట : మంగవరం గ్రామంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుర్గమ్మ సరస్వతీ దేవి అవతారంలో దర్శనమిచ్చారు. చదువుల తల్లి సరస్వతీ దేవికి 101 మంది బాల బాలికలతో కుంకుమ పూజ జరిపించి, ప్రసాదం, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

ఎస్.రాయవరం: తిమ్మాపురం గ్రామంలో నూకాంబిక గుడి వద్ద కొలువుదీరిన దుర్గమ్మ సన్నిధిలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. దమ్ము రాజు దంపతులు సుమారు 70 మంది విద్యార్థులకు పెన్నులు, అట్టలు బహూకరించారు.



తిమ్మాపురంలో పూజలు చేస్తున్న మహిళలు



యలమంచిలి మిలట్రీ కాలనీలో అమ్మవారి మండపంలో సరస్వతీ పూజల్లో పాల్గొన్న విద్యార్థులు



యలమంచిలి వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సామూహిక సరస్వతీ పూజ



పాములవాకలో సరస్వతీదేవిగా అమ్మవారు



సరస్వతీదేవి అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి